సాక్షి రంగారెడ్డి

ఆదివారం । 6 । ఆగస్టు । 2023



అమ్మమ్మను చూసేందుకు..

వెనక నుంచి వేగంగా వచ్చిన సిమెంట్ ట్యాంకర్.. బైక్‌ను ఢీకొట్టడంతో ఓ బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. 10లో▸



బోసిపోయిన ఇబ్రహీంపట్నం బస్టాండ్

న్యూస్‌రీల్

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

జిల్లా పశువైద్యాధికారి అంజిలప్ప



టీకాల వివరాలు తెలుసుకుంటున్న జిల్లా పశువైద్యాధికారి అంజిలప్ప

షాబాద్: గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలని జిల్లా పశువైద్యాధికారి అంజిలప్ప అన్నారు. మండల పరిధిలోని కుమ్మరిగూడలో వైద్య సిబ్బంది పశువులకు వేస్తున్న గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేశవగూడలో ప్రభుత్వం గొల్ల, కుర్మలకు అందజేసిన సబ్సిడీ గొర్రెలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులతో రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అర్హులైన గొల్ల, కుర్మలందరికీ ప్రభుత్వం రెండో విడత సబ్సిడీ గొర్రెలు అందిస్తునున్నట్లు తెలిపారు. ఆయన వెంట మండల పశువైద్యాధికారిణి డాక్టర్ స్రవంతి, రైతులు ఉన్నారు.

'మెట్రో'ను చేవెళ్ల వరకు పొడిగించండి

అసెంబ్లీలో ప్రస్తావించిన చేవెళ్ల ఎమ్మెల్యే కాల యాదయ్య



అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలపై ప్రస్తావిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ఇటీవల నగరం చుట్టూ ఉన్న ప్రాంతాలకు విస్తరించిన మెట్రో రైలు మార్గాన్ని చేవెళ్ల వరకు పొడిగించాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించారు. శనివారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆయన నియోజకవర్గంలోని పలు సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..నూతనంగా శంషాబాద్ వరకు పొడిగిస్తున్న మెట్రో రైలు మార్గాన్ని చేవెళ్ల వరకు పొడిగించాలని కోరారు. హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉన్న చేవెళ్ల నియోజకవర్గంలోని చేవెళ్ల, మొయినాబాద్, షాబాద్ మండలాలకు ఎలాంటి రైలు మార్గం లేదని, కనీసం మెట్రో రైలు మార్గం అయినా కొనసాగించాలని కోరారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ఆసరా పింఛన్లు విడుదల చేయాలన్నారు. చేవెళ్ల ఆస్పత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేసినందుకు మంత్రి హరీశ్‌రావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేయాలని కోరారు.

17 నుంచి సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ పోటీలు

మలక్‌పేట: రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 9వ రాష్ట్ర సబ్ జూనియర్ కె.పాణిరావు మెమోరియల్ చాంపియన్ షిప్–2023 నిర్వహించనున్నారు. అండర్–15 బాలురు, బాలికలకు బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కరెడ్ల శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 14వ తేదీలోగా ఆసక్తి కలిగిన క్రీడాకారులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 98480 15443, 77889 93006 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



ఇబ్రహీంపట్నం: ప్రైవేట్ వాహనాల్లో వెళ్తున్న ప్రయాణికులు

కార్మికుల ఆందోళన.. ప్రయాణికుల ఆవేదన

ఆర్టీసీ బిల్లును గవర్నర్ వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేస్తూ ఆయా డిపోల వద్ద శనివారం కార్మికులు ఆందోళన నిర్వహించారు. డిపోల నుంచి బస్సులను కదలనీయకుండా భీష్మించుకు కూర్చున్నారు. బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత్యంతరం లేక ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. మరోవైపు బస్సులు రాకపోవడంతో ఆయా బస్టాండ్లు బోసిపోయి కనిపించాయి.



ఇబ్రహీంపట్నం: డిపో ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

మళ్లీ మొదటికే..

నిలిచిపోయిన ఫార్మాసిటీ భూ సేకరణ ప్రక్రియ

- పాత నోటిఫికేషన్లు రద్దు చేసిన హైకోర్టు
- కొత్త నోటిఫికేషన్ ఇవ్వాలని ఆదేశం
- రైతుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచన
- బాధితుల అంగీకారం కష్టమే..
- మార్కెట్ ధర చెల్లింపు ప్రభుత్వానికి భారమే



నక్కర్తమేడిపల్లిలో రైతులు సాగు చేసిన ఫార్మాసిటీ భూమి

యాచారం: హైదరాబాద్ ఫార్మాసిటీ వ్యవహారం మళ్లీ మొదటికొచ్చింది. భూసేకరణ విషయంలో అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించడం, రైతుల డిమాండ్లను పరిగణనలోకి తీసుకోకపోవడం, అడ్డగోలుగా అవార్డులు పాస్ చేయడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. భూసేకరణ, పునరావస చట్టం ప్రకారం పరిహారం ఇవ్వలేదని, 2013 భూసేకరణ చట్టాన్ని అధికారులు తుంగలో తొక్కారని ఆగ్రహం వ్యక్తం చేసింది. గత నోటిఫికేషన్లు రద్దు చేస్తున్నట్లు శుక్రవారం తీర్పు వెలువర్చింది. మళ్లీ నోటిఫికేషన్ జారీ చేసి, రైతుల అంగీకారం మేరకే భూసేకరణ పక్రియను చేపట్టాలని సూచించింది. దీంతో ఆయా గ్రామాల్లో బాధితులు సంబరాలు చేసుకోగా.. ఫార్మాసిటీ అభివృద్ధి పనులు ప్రశ్నార్థకంగా మారింది. మార్కెట్ ధరకు అనుగుణంగా రైతులకు పరిహారం చెల్లింపు ప్రభుత్వానికి భారంగా మారే అవకాశం లేకపోలేదు.

3 మండలాలు.. 10 గ్రామాలు

రంగారెడ్డి జిల్లా కందుకూరు, ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఫార్మాసిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు టీఎస్ఐఐసీ ద్వారా 2016–17లో యాచారం, కందుకూరు, కల్వకుర్తి నియోజకవర్గాల్లోని పది గ్రామాల పరిధిలో పట్టా, అసైన్డ్ భూముల సేకరణ ప్రక్రియను ప్రారంభించింది.19,333 ఎకరాల్లో రూ.64 వేల కోట్ల పెట్టుబడితో ప్రత్యక్షంగా, పరోక్షంగా 5.6 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాలనే ఉద్దేశంతో ఫార్మాసిటీ ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా యాచారం మండలంలోని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్,తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో 9,851 ఎకరాల పట్టా, అసైన్డ్ భూమిని సేకరించాలని నిర్ణయించింది. ఇందులో 6,150 ఎకరాల పట్టా భూమి, 3,701 ఎకరాల అసైన్డ్ భూమి ఉన్నట్లు ప్రకటించింది. ఇప్పటికే 7,640 ఎకరాల పట్టా, అసైన్డ్ భూమిని రైతుల నుంచి సేకరించి ఫార్మాసిటీకి కేటాయించారు. పట్టా భూమికి ప్రభుత్వం మొదట్లో ఎకరాకు రూ.12.50 లక్షలు, అసైన్డ్ భూమికి రూ.8 లక్షల చొప్పున పరిహారం చెల్లించింది. బహిరంగ మార్కెట్లో ఇక్కడి భూములకు ఎకరాకు రూ.కోటి వరకు పలుకుతుండటంతో పలువురు పట్టా రైతులు అభ్యంతరం తెలిపారు. దీంతో పరిహారాన్ని రూ.16 లక్షలకు పెంచారు. అయినప్పటికీ కొంతమంది బాధితులు ఇందుకు అంగీకరించలేదు.

2020 జులైలో కోర్టుకు..

నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద, నక్కర్తిమేడిపల్లికి చెందిన సుమారు 250 మంది రైతులు 2020 జులై 23న మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డి కోదండరెడ్డి, పర్యావరణవేత్త కవుల సరస్వతి సహకారంతో హైకోర్టును ఆశ్రయించారు.అయినా ప్రభుత్వం మొండిగా ముందుకెళ్లింది. వీరినుంచి బలవంతంగా భూముల ను స్వాధీనం చేసుకుంది. అవార్డులు జారీ చేసి 1,966 ఎకరాల పట్టా భూముల పరిహారాన్ని అథారిటీలో జమ చేసింది. ధరణిలో రైతుల పేర్లను బ్లాక్ చేసి, వారి స్థానంలో టీఎస్ఐఐసీ పేరును నమోదు చేసింది. దీంతో వీరందరికీ రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ వంటి పథకాలు వర్తించకుండా చేసింది. ధరణి పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేయాలని బాధిత రైతులు పలుమార్లు యాచారం తహసీల్దార్, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ, జిల్లా కలెక్టర్, సీసీఎల్ఏ కార్యాలయాల్లోని ఉన్నతాధికారులను ఆశ్రయించారు. తాజాగా నక్కర్తమేడిపల్లి, కుర్మిద్ద గ్రామాల్లో ని పట్టా భూముల సేకరణ ప్రక్రియ నోటిఫికేషన్లను హైకోర్టు రద్దు చేయడంతో శనివారం ఆయా గ్రామాల్లోని రైతులు స్వీట్లు పంచుకుని, సంబరాలు జరుపుకొన్నారు. ఫార్మాకు భూములిచ్చే ప్రసక్తే లేదని తేల్చిచెబుతున్నారు. ఇదిలా ఉండగా ఎన్నికలకు ముందు ఫార్మాసిటీని ప్రారంభించాలనే పెద్దల ఆశయంపై నీలినీడలు కమ్ముకున్నాయి.

ఇది రైతుల విజయం..



చల్లా నర్సింహారెడ్డి

కందుకూరు: హైకోర్టు ఫార్మాసిటీ భూసేకరణకు స్టే విధించడం రైతుల విజయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఫార్మాసిటీ పేరుతో పేదల భూములను తీసుకుని బడా వ్యాపారులకు అధిక ధరలకు విక్రయిస్తోందని ఆరోపించారు. పరిహారం కింద కేవలం రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకే ఇచ్చి రైతులను మోసం చేస్తోందన్నారు. కాంగ్రెస్ హయాంలో ఇందిరమ్మ పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను సైతం తీసుకుంటున్నారన్నారు. ఫార్మాసిటీ కాకుండా కలుషితం లేని కంపెనీలు ఏర్పాటు చేసి ఎకరాకు రూ.1.50 కోట్ల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేదల భూములు వారికే అప్పగిస్తామన్నారు.

ప్రాణాలైనా ఇస్తాం..



ప్రాణాలైనా ఇస్తాం కానీ ఫార్మాసిటీకి భూములు మాత్రం ఇవ్వం. అధికారులు చాలాసార్లు మా వద్దకు వచ్చినా తిప్పి పంపించాం. కోర్టు తీర్పుపై చాలా సంతోషంగా ఉన్నాం. మా గ్రామానికి చెందిన పాత రైతులెవరూ భూములు ఇవ్వలేదు. కొత్తగా కొనుగోలుచేసిన వారే ఇచ్చారు.

– ముత్యాల చంద్రారెడ్డి, రైతు, నానక్‌నగర్

ఆది నుంచీ తప్పిదాలే..



భూసేకరణ విషయంలో అధికారులు అన్నీ తప్పిదాలే చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ సమయంలోనూ బెదిరింపులకు పాల్పడ్డారు. అంగీకారం తెలిపితే ఎకరాకు రూ.16 లక్షలు ఇస్తాం.. లేదంటే రూ.7 లక్షల చొప్పున అథారిటీలో జమచేస్తాం అని హెచ్చరించారు. కోర్టు తీర్పు రైతుల విజయమే.

– ముదిరెడ్డి కోదండరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

ఉత్తర్వులు అందలేదు



నక్కర్తమేడిపల్లి, కుర్మిద్ద గ్రామాల్లో ఫార్మాసిటీ భూసేకరణ విషయంలో హైకోర్టు నోటిఫికేషన్లు రద్దు చేసిన విషయంపై ఇంకా ఉత్తర్వులు అందలేదు. ఈ విషయంలో ఉన్నతాధికారుల సూచన మేరకు నడుచుకుంటాం. కోర్టు తీర్పును గౌరవిస్తూ.. న్యాయబద్ధంగా ముందుకు వెళ్తాం.

– కె.అనంత్‌రెడ్డి, ఆర్డీఓ ఇబ్రహీంపట్నం

ఆరోగ్యమే మహా భాగ్యం

- ఎంపీ రంజిత్‌రెడ్డి



ఆరోగ్య రథాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

శంకర్‌పల్లి: ఆరోగ్యమే మహా భాగ్యమని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. 'పల్లెపల్లెకూ వైద్యం–గడపగడపకూ రంజిత్ అన్న' ఆరోగ్య రథం సేవలను పర్వేద గ్రామంలో సర్పంచ్ అనితతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చేవెళ్ల నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలనే ఉద్దేశంతోనే ఆరోగ్య రథంను ప్రారంభించినట్లు తెలిపారు. ఉచిత ఆరోగ్య పరీక్షలతో పాటు మందులను కూడా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న వారికి చేవెళ్లలోని పీఎంఆర్, ఐఎంఎస్‌లో ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ గోవిందమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయ లక్ష్మి, వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పాపారావు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధికి కృషి

చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని కమ్మెట–ప్రొద్దటూరు కత్వను శనివారం ఆయన పరిశీలించారు. కాల్వ మరమ్మతుల కోసం ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. మిషన్ కాకతీయతో చెరువుల రూపురేఖలు మారిపోయాయన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోవర్ధన్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం కొనసాగాలి



మొయినాబాద్‌లో నర్సరీని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

- జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

మొయినాబాద్: మొక్కలు నాటే కార్యక్రమం నిరంతర ప్రక్రియగా కొనసాగాలని జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు, మొయినాబాద్ గ్రామాల్లో శనివారం ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ శ్రీకాంత్‌తో కలిసి ఆమె పర్యటించారు. వన నర్సరీలను పరిశీలించి ఏయే రకాల మొక్కలు పెంచుతున్నారు.. ఎన్ని మొక్కలు పెంచుతున్నారు.. వాటిని ఎక్కడెక్కడ నాటుతున్నారు అనే విషయాలను అధికారులు, సర్పంచ్‌లతో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే అలవాటు చేసుకోవాలని.. ఈ ప్రక్రియను భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. ఇప్పటి వరకు నాటిన మొక్కల ఫలితంగానే వర్షాలు బాగా పడుతున్నాయని.. చెరువులు, కుంటలు నిండి భూగర్భజలాలు పెరిగాయన్నారు. పంచాయతీల అభివృద్ధి, బలోపేతానికి సీఎం కేసీఆర్ అనేక పథకాలను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మమత, ఎస్ఆర్ఈజీఎస్ ఏపీడీ చరణ్‌గౌతం, ఎంపీడీఓ సంధ్య, ఎంపీఓ వెంకటేశ్వరరెడ్డి, పీఆర్ ఏఈ ఆశాజ్యో తి, చిలుకూరు సర్పంచ్ స్వరూప, మొయినాబాద్ ఉపసర్పంచ్ రాజేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

మొయినాబాద్‌రూరల్: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని జెడ్పీ చైర్ పర్సన్ అనితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్,కనకమామిడి గ్రామాల్లో శనివారం స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి నర్సరీలను పరిశీలించారు. మొక్కలు నాటే కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రంజీవంతు, జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, ఎంపీడీవో సంధ్య, ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మమత, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గ్రీన్‌జోన్.. పరేషాన్

- విముక్తి కల్పించాలని ఏళ్ల తరబడి ఆల్మాస్‌గూడవాసుల ఆందోళన
- తాజాగా అసెంబ్లీ ముట్టడి.. ఆందోళనకారుల అరెస్టు



అసెంబ్లీ ముట్టడికి పాల్పడినవారిని అరెస్ట్ చేస్తున్న పోలీసులు

బడంగ్‌పేట్: ప్రభుత్వ ఉదాసీనత.. అధికారుల అనాలోచిత నిర్ణయాలు వెరసి ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులకు ఇబ్బందులు తప్పడం లేదు. తమ ఇళ్లకు.. ఖాళీ ప్లాట్లకు గ్రీన్‌జోన్ నుంచి విముక్తి కల్పించాలని కోరుతూ ఏళ్ల తరబడి ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. ఇటు అధికారుల నుంచి.. అటు ప్రజాప్రతినిధుల నుంచి సరైన స్పందన లేకుండా పోయింది. తాజాగా శనివారం అసెంబ్లీ ముట్టడికి యత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు.

హెచ్ఎండీఏ ఏర్పాటుకు ముందే కొనుగోలు

బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలోని సర్వే నంబర్లు 122,123,124,129, 130లో 1985–86లో సుమారు 70 ఎకరాల పట్టా భూముల్లో 25 ఏళ్ల క్రితం లేఅవుట్‌లు చేశారు. ఆయా వెంచర్లలో మల్లారెడ్డి నగర్, సాయిహోమ్స్, వెంకటేశ్వర కాలనీ, ఏఆర్‌సీఆర్, ఎస్కే హిల్స్, విశాఖనగర్ ఫేస్–1 ఏర్పడ్డాయి. ఇతర జిల్లాల నుంచి నగరానికి వలస వచ్చిన వారు ఇక్కడ ప్లాట్లు కొనుగోలు చేశారు. 2000 సంవత్సరంలో పాత పంచాయతీ అనుమతితో సుమారు ఆరు వందల మంది ఇక్కడ ఇళ్లు ఐనిర్మించుకున్నారు. ఇంటిపన్నుతో పాటు కరెంట్, వాటర్ బిల్లులు కూడా చెల్లిస్తున్నారు. అంతా సవ్యంగా ఉందనుకునే సమయంలో ఆయా భూముల్లో ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులు పిడుగులాంటి వార్త వినాల్సి వచ్చింది. 2008 హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్‌లో ఈ సర్వే నంబర్లలోని పట్టా భూములను గ్రీన్ జోన్ కింద నమోదు చేసింది. కొత్త ఇళ్ల నిర్మాణాలకు ఆ తర్వాత వచ్చిన కార్పొరేషన్ అనుమతులు నిలిపేసింది. బ్యాంకులు లోన్లు ఇవ్వడం లేదు. ఇళ్లు నిర్మించుకున్న వారి నుంచి మాత్రం ఇప్పటికీ పన్నులు వసూలు చేస్తూనే ఉంది.

25 ఏళ్లుగా పోరాటం

నిజానికి ఈ ప్రాంతం ఇటు ఓఆర్ఆర్‌కు, అటు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు దూరంగా ఉంటుంది. హెచ్ఎండీఏ ఏర్పాటుకు ముందే ఏర్పడిన కాలనీలను, అందులోని ఇళ్లను ఎలా గ్రీన్‌జోన్ పరిధిలోకి తీసుకొస్తారని ఆయా ఇళ్లు, ప్లాట్ల బాధితులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు క్షేత్ర పర్యటన చేయకుండా, కనీసం గ్రామపంచాయితీ పాలకవర్గాన్ని సంప్రదించకుండా తీసుకున్న నిర్ణయంతో 25 ఏళ్లుగా ఇబ్బంది పడాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధితుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పాలక మండలి కూడా ఈ మేరకు ఓ తీర్మానం చేసి హెచ్ఎండీఏకు పంపింది. అయినా ఇప్పటి వరకు పరిష్కార మార్గం లభించలేదు.

అసెంబ్లీ ముట్టడి.. అరెస్ట్

విజ్ఞప్తులకు స్పందించకపోవడంతో బాధితులు శనివారం అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. పోలీసులు ఆందోళనకారులను అరెస్ట్ చేసి ముషీరాబాద్ స్టేషన్‌కు తరలించారు. దీంతో మరుగునపడ్డ గ్రీన్‌జోన్ సమస్య మళ్లీ తెరపైకి వచ్చింది. ఈ సందర్భంగా మహేశ్వరం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మంత్రి సబితారెడ్డి పట్టించుకోకపోవడంతో గ్రీన్ జోన్ ప్రజలు నలుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌కు కోట్లల్లో నష్టం వస్తుంటే ఎందుకు ఎత్తివేయడం లేదని ధ్వజమెత్తారు.

కుర్చీ తెచ్చాం.. కేసీఆర్ ఎక్కడ..?

- లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు స్థలాన్ని సందర్శించిన బీజేపీ నాయకులు
- సీఎం కేసీఆర్ వైఖరిపై ఆగ్రహం



లక్ష్మీదేవిపల్లి వద్ద కుర్చీవేశామని చూపుతున్న బీజేపీ నాయకులు

కొందుర్గు: లక్ష్మీదేవిపల్లి అత్యంత ఎత్తయిన ప్రదేశం ..ఇక్కడ ప్రాజెక్టు నిర్మిస్తే నెత్తిమీద కుండలా ఉంటుందని.. ప్రాజెక్టు నిర్మాణంతో రంగారెడ్డి, పాలమూరు, నల్లగొండ జిల్లాలు సస్యశ్యామలం అవుతాయని అప్పట్లో ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి గుర్తు చేశారు. తనను గెలిపిస్తే కుర్చీవేసుకొని కూర్చొని ప్రాజెక్టు నిర్మిస్తామన్నారు.. రెండుసార్లు ముఖ్యమంత్రి అయ్యారు.. ఇంకా ప్రాజెక్టు నిర్మించలేదు.. కుర్చీ లేకే ప్రాజెక్టు నిర్మించలేదేమో.. కుర్చీ వేశాం.. కేసీఆర్ ఎక్కడున్నారో వచ్చి ఇక ప్రాజెక్టు నిర్మించండి అంటూ ఎద్దేవా చేశారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మించడానికి గుర్తించిన స్థలాన్ని శనివారం బీజేపీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో బొక్క నర్సింహా రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో వందల కోట్లకు భూములు అమ్ముకుంటున్నారు కానీ ఒరగబెట్టిందేమిలేదన్నారు. నిన్న కోకాపేట, రేపు బుద్వేల్, ఎల్లుండి మరోచోట భూములు అమ్ముతూనే ఉంటారని విమర్శించారు. బుద్వేల్ భూముల అమ్మకాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. కేసీఆర్‌కు ఉత్తర తెలంగాణ పైన ఉన్న ప్రేమ దక్షిణ తెలంగాణపై లేదని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విమర్శించారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని తెచ్చి ప్రాజెక్టు నిర్మిస్తే ఈ ప్రాంతానికి సాగునీరు, తాగునీరు సరిపోతుందన్నారు. శ్రీశైలం బ్యాక్‌వాటర్‌తో ప్రాజెక్టు నిర్మిస్తే సాగునీరు కాదు తాగునీరు కూడా సరిపోతుందన్నారు. పార్టీ జాతీయ నాయకుడు ఆచారి మాట్లాడుతూ.. కల్వకుర్తి ప్రాంతంలో వేల ఎకరాల భూములను అమ్ముకున్నారని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వస్తే లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మించి ఈ ప్రాంత రైతుల కాళ్లు కడుగుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మిథున్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీవర్ధన్ రెడ్డి, భూపాలచారి, మండలాధ్యక్షుడు కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని పట్ల అసభ్య ప్రవర్తన

పీఈటీని చితకబాదిన పేరెంట్స్

అత్తాపూర్: విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ) విష్ణును చితకబాదారు. అతనిపై చర్యలు తీసుకోవాలని ఓ బాలిక తల్లిదండ్రులు అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్ గోల్డెన్ ప్యాలెస్ హోటల్ సమీపంలోని ఓ పాఠశాలలో పాండురంగానగర్‌కు చెందిన ఓ బాలిక 8వ తరగతి చదువుతోంది. కొంత కాలంగా ఇక్కడి పీఈటీ విష్ణు విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు ఫోన్ చేస్తూ ఇబ్బందులు పెడుతున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, విద్యార్థి నాయకులు స్థానికులతో కలిసి శనివారం ఉదయం పాఠశాలకు చేరుకున్నారు. గొడవ జరుగుతుందని గమనించిన పాఠశాల యాజమాన్యం పీఈటీ విష్ణును పాఠశాల 4వ అంతస్తులోని ఓ గదిలో దాచిపెట్టింది. విషయం తెలుసుకున్న విద్యార్థి నాయకులు, కుటుంబ సభ్యులు వెళ్లి విష్ణును బయటకు తీసుకువచ్చి చితకబాది పోలీసులకు అప్పగించారు. పాఠశాల ప్రిన్సిపాల్ గదిలోని కంప్యూటర్లను ధ్వంసం చేశారు. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న పీఈటీ విష్ణును వెంటనే తొలగిస్తామని ప్రిన్సిపాల్ వినీత హామీ ఇచ్చారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏఎన్‌ఎంలను పర్మినెంట్ చేయాలి

కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా


కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏఎన్‌ఎంలు, ఏఐటీయూసీ నాయకులు

తుక్కుగూడ: వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న ఏఎన్‌ఎంలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పానుగంటి పర్వతాలు, ఓరుగంటి యాదయ్య మాట్లాడారు. 16 సంవత్సరాలుగా వైద్య శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న ఏఎన్‌ఎంలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన ఏఎన్‌ఎంల భర్తీ పేరుతో నోటిఫికేషన్ విడుదల చేయడం దారుణమన్నారు. వృత్తిలో నైపుణ్యం వారిని వెంటనే రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకురాలు పద్మ, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

అమ్మమ్మను చూసేందుకు వచ్చి..


బైక్ వెనకాల అతివేగంతో వెళ్తున్న సిమెంట్ ట్యాంకర్


బైక్‌ను ఢీకొట్టడంతో సిమెంట్ ట్యాంకర్ టైర్ల కిందపడిన విఘ్నేశ్‌చారి

- రోడ్డు ప్రమాదంలో బాలుడి దుర్మరణం
- బైక్‌ను ఢీ కొట్టిన సిమెంట్ ట్యాంకర్
- మొయినాబాద్ సమీపంలో ఘటన


విఘ్నేశ్‌చారి (ఫైల్)

మొయినాబాద్: వెనక నుంచి వేగంగా వచ్చిన సిమెంట్ ట్యాంకర్.. బైక్‌ను ఢీకొట్టడంతో ఓ బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన శనివారం మొయినాబాద్ సమీపంలోని రాధాస్వామి సత్సంగ్ సమీపంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వికారాబాద్ జిల్లా కుల్కచర్లకు చెందిన కొత్తపల్లి విఘ్నేశ్‌చారి (19) తల్లి మరణించడంతో.. తండ్రి మరో వివాహం చేసుకున్నాడు. దీంతో బాలుడు చేవెళ్ల మండలం దేవరంపల్లిలో అమ్మమ్మ సువర్ణ వద్ద ఉంటూ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పదిహేను రోజుల క్రితం విఘ్నేశ్‌చారి నగరంలోని కార్వాన్‌లో ఉండే మామ వద్దకు వెళ్లాడు. అమ్మమ్మ మొయినాబాద్‌లోని భాస్కర ఆస్పత్రిలో కళ్ల వైద్యం చేయించుకునేందుకు వెళ్లిందని తెలియడంతో శనివారం ఆమెను పరామర్శించి రూ.2 వేలు ఇచ్చాడు. అనంతరం మొయినాబాద్ సమీపంలోని రాధాస్వామి సత్సంఘ్ వద్ద రోడ్డు పక్కన ఆగి భోజనం చేశాడు. రూ.500 నోటు ఇవ్వడంతో హోటల్ నిర్వాహకులు చిల్లర లేవని చెప్పారు. దీంతో మొయినాబాద్‌కు వెళ్లి, చిల్లర తీసుకుని వెనుదిరిగాడు. ఈ సమయంలో గుర్తుతెలియని వ్యక్తికి లిఫ్ట్ ఇచ్చాడు. అతన్ని ఎక్కించుకుని వచ్చి హోటల్ వద్ద బైక్ మలుపుతుండగా వెనకనుంచి అతివేగంగా వచ్చిన సిమెంట్ ట్యాంకర్ ఢీకొట్టింది. వెనక కూర్చున్న వ్యక్తి ఎగిరి రోడ్డు పక్కన పడగా.. విఘ్నేశ్‌చారి ట్యాంకర్ టైర్ల కింద పడ్డాడు. అతని నడుముపై నుంచి వెళ్లిన వాహనం కొద్దిదూరం ఈడ్చుకెళ్లింది. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. రోడ్డు పక్కన ఎగిరిపడ్డ వ్యక్తి ప్రాణాలతో బయటపడి అక్కడి నుంచి పారిపోయాడు. ఇదిలా ఉండగా విఘ్నేశ్‌చారి తల్లి ఆరేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకుంది. ఆ తర్వాత రెండేళ్లకే అన్న మరణించాడు. ఆస్పత్రిలో ఉన్న అమ్మమ్మను చూసేందుకు వచ్చిన విఘ్నేశ్‌ను ట్యాంకర్ బలితీసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

డస్ట్ లోడ్ ఖాళీ చేస్తుండగా ..

విద్యుదాఘాతంతో టిప్పర్ డ్రైవర్ మృతి


వెంకట్ మృతదేహం

చేవెళ్ల: టిప్పర్‌లో డస్ట్ ఖాళీచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా ముడ్బి గ్రామానికి చెందిన కూరి వెంకట్(30) ఐదేళ్ల క్రితం సంగారెడ్డి జిల్లా కంది మండల రుద్రారం గ్రామానికి వలస వచ్చాడు. చేవెళ్లకు చెందిన గుత్తి నర్సింలు వద్ద టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చేవెళ్లలోని ఓ వెంచర్‌లోతెల్లవారు జామున 1.30గంటల ప్రాంతంలో టిప్పర్‌లో డస్ట్ ఖాళీ చేస్తుండగా లారీపై ఉన్న 33కేవీ విద్యుత్ వైర్లకు లారీ తొట్టి తగలడంతో విద్యుత్ సరఫరా అయింది. దీంతో వెంకట్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాపారవేత్త అదృశ్యం


శ్రీధర్‌రావు

శంషాబాద్: స్నేహితుడిని కలవడానికి ఢిల్లీ వెళ్లిన వ్యాపారవేత్త అదృశ్యమయ్యాడు.ఈ సంఘటన ఆర్‌జీఐఏ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. విజయవాడకు చెందిన శ్రీధర్‌రావు స్థానికంగా వ్యాపార వేత్తగా స్థిరపడ్డాడు. జులై 16 ఢిల్లీలో ఉన్న స్నేహితులను కలిసేందుకు వెళుతున్నట్లు చెప్పారు. ఈ మేరకు అతడి భార్య శ్రీధర్‌రావును ఎయిర్‌పోర్టులో డ్రాప్ చేసి వెళ్లింది. మరుసటి రోజు ఫోన్ చేసిన శ్రీధర్‌రావు తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరినట్లు భార్యకు చెప్పాడు. శ్రీధర్‌రావు హైదరాబాద్‌కు తిరిగి రాకపోవడంతో పాటు అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ ఉండడంతో శనివారం ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం


గడ్డం సాయితేజ

పట్టణంలోని వీకర్ సెక్షన్ కాలనీలో గడ్డం సాయితేజ (23) స్థానికంగా ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ నెల 4న కంపెనీలో యాథావిధిగా డ్యూటీకి వెళ్లాడు. మరుసటి రోజు తిరిగి వస్తున్నానని కుటుంబసభ్యులకు ఫోన్‌చేసి చెప్పాడు. ఎంతకీ తిరిగిరాకపోవడంతో అన్ని చోట్లా వెతికిన కుటుంబసభ్యులు శనివారం ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసున మోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

మంచాల: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. మంచాల ఎస్‌ఐ రవినాయక్ తెలిపిన ప్రకారం.. యాదాద్రి జిల్లా నారాణపురం మండలం రాచకొండకు చెందిన రాజు కొన్ని రోజులుగా ఇసుకను అక్రమంగా తరలిస్తూ విక్రయిస్తున్నాడు. శనివారం ఇసుక తరలిస్తుండగా ఆరుట్ల సమీపంలో పోలీసులు తనిఖీలు చేపట్టగా ఎటువంటి అనుమతి పత్రాలు లభించలేదు. దీంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి రాజుపై కేసు నమోదు చేశామన్నారు.